సాక్షి ఖమ్మం

సోమవారం ׀ 26 ׀ ఫిబ్రవరి ׀ 2024



దేవుడి భూములకు ఎసరు !

ఆలయాల్లో నిత్యారాధనకు ఆటంకం కలగకుండా ఏళ్ల క్రితం దాతలు భూములు ఇస్తే.. అక్రమార్కులు ఆ భూములను కొల్లగొడుతున్నారు. 8లో



..అప్పీల్‌ను కొట్టేసిన హైకోర్టు..

రోడ్డు ప్రమాద ఘటనలో బాధితుడికి నిబంధనల మేరకు బీమా కంపెనీ నష్టపరిహారం చెల్లించాలని హైకోర్టు తీర్పు చెప్పింది. 8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామాలయంలో చిన్న గరుడ వాహన సేవ ప్రారంభం



చిన్న గరుడ వాహన సేవను ప్రారంభిస్తున్న ఈఓ, ఏఈఓ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం చిన్న గరుడ సేవను ఆదివారం ప్రారంభించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులంతా నిత్యకల్యాణం, వాహన సేవల్లో పాల్గొనాలని ఆశ పడుతుంటారు. దీంతో భక్తుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న ఆలయ అధికారులు చిన్న గరుడ వాహన సేవను ప్రవేశపెట్టారు. రూ.250 టికెట్‌తో స్వామివారు ఆశీనులైన వాహనాలతో పల్లకీ సేవ జరపవచ్చు. దీనిని ఆదివారం ఆలయ ఈఓ రమాదేవి, ఏఈఓ శ్రవణ్‌కుమార్ ప్రారంభించారు. భక్తులు ఈ అవకాశాన్ని ప్రత్యేక రోజుల్లో మినహా నిత్యం సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన వైభవంగా జరిపించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ప్రశాంతంగా సీఓఈ ప్రవేశ పరీక్ష



ఓ పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ప్రత్యూష

ఖమ్మంమయూరిసెంటర్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ) రెండో దశ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మం రీజియన్‌లోని ఐదు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు కోఆర్డినేటర్ కె.ప్రత్యూష తెలిపారు. ఖమ్మంలోని అంబేద్కర్ బాలికలు, దానవాయిగూడెం బాలికలు, టేకులపల్లి బాలికల కళాశాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ బాలికలు, మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్ బాలికల కళాశాలల్లో ఈ పరీక్ష నిర్వహించారని తెలిపారు. ఈ ఐదు కేంద్రాల్లో 1,794 మంది విద్యార్థులకు గాను 1,715 మంది హాజరయ్యారని, 79 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఏఐసీబీఈఎఫ్ జాతీయ కార్యదర్శిగా నాగేందర్



పాశం నాగేందర్

ఖమ్మంవ్యవసాయం: ఆలిండియా కో–ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఏఐసీబీఈఎఫ్) జాతీయ కార్యదర్శిగా ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారి పాశం నాగేందర్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఫెడరేషన్ జాతీయ మహాసభల్లో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో నాగేందర్‌కు జాతీయ కార్యదర్శి పదవి దక్కింది. ఆయన తెలంగాణ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా యూనిట్ కార్యదర్శిగా మూడు పర్యాయాలు, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంక్ ఉద్యోగుల కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. నాగేందర్‌కు జాతీయ స్థాయిలో ప్రధాన పదవి రావడం పట్ల సహకార ఉద్యోగులు, అధికారులు అభినందనలు తెలిపారు.

మాజీ అడిషనల్ డీసీపీపై చీటింగ్ కేసు

ఖమ్మంక్రైం : కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణం చేపడుతున్న ఖమ్మం మాజీ అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్‌పై ఖానాపురం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. నగర పరిధిలోని ఓ ప్రాంతంలో బోస్ కుమారుడి పేరున ఇంటి నిర్మాణానికి టీఎస్ బీపాస్‌లో దరఖాస్తు చేశారు. అయితే అందులో పేర్కొన్న విధంగా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారంటూ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి ఖానాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సుభాష్‌చంద్రబోస్‌తో పాటు కుటుంబసభ్యులు, బిల్డర్ రాధాకృష్ణ, సాంకేతిక నిపుణుడు సోయబ్‌పై సెక్షన్ 420 కింద చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

‘పది’పై ఫోకస్





విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం (ఫైల్) (ఇన్‌సెట్) స్టడీ అవర్‌లో సమకూర్చిన టీ, స్నాక్స్

ఎస్సెస్సీ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక

- సంక్షేమ హాస్టళ్లలో ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు
- రాత్రి వేళ ప్రత్యేకంగా స్నాక్స్, టీ కూడా..
- జిల్లాలో 33 బీసీ, ఎస్సీ హాస్టళ్లు.. 867 మంది విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో ఉంటూ పదో తరగతి అభ్యసిస్తున్న విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు సంక్షేమశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చిలో జరగనున్న నేపథ్యాన జిల్లాలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల్లోని విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించేలా అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలో డివిజన్ల వారీగా వసతిగృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక ప్రేరణ కార్యక్రమాలు పూర్తి చేయగా.. పాఠశాలల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులకు అనుగుణంగా విద్యార్థులు పాఠశాలల నుంచి హాస్టళ్లకు రాగానే స్టడీ అవర్‌లు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థుల వివరాలను సేకరించి వారిని ప్రత్యేకంగా చదివిస్తున్నారు. జిల్లాలో 21 ఎస్సీ వసతిగృహాల్లో 521 మంది, 22 బీసీ వసతిగృహాల్లో 346 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరంతా వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా హెచ్‌డబ్ల్యూఓలు, ఏఎస్‌డబ్ల్యూఓలు, జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక ప్రణాళికలతో విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

ప్రత్యేక మెనూ సైతం..

వసతి గృహాల్లో స్టడీ అవర్ సమయంలో విద్యార్థులకు ప్రత్యేక మెనూ ఏర్పాటు చేశారు. రాత్రి వేళ విద్యార్థులు అలసిపోకుండా 9 గంటల సమయంలో పండ్లు, టీ, పిండిపదార్థంతో కూడిన స్నాక్స్ అందిస్తున్నారు. రాత్రి వేళ ప్రత్యేక మెనూ కింద ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున ఖర్చు చేసి వీటిని అందిస్తున్నారు. రోజువారీగా వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు అందించే మెనూతో పాటు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా అందిస్తున్నారు.

ఎస్సీ వసతిగృహాల్లో స్టడీ మెటీరియల్

ఎస్సీ వసతిగృహాల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. అన్ని పాఠ్యాంశాలతో కూడిన ఆల్ ఇన్ వన్‌ను రూపొందించి, గతంలో జరిగిన వార్షిక పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలు, వాటికి సంబంధించిన జవాబులతో కూడిన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులతో ఈ మెటీరియల్‌లో ఉన్న ప్రశ్నా జవాబులు చదివిస్తున్నారు.

వసతిగృహాల్లో స్టడీఅవర్స్..

ఎస్సీ, బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వసతిగృహాల్లో ఉండి పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఆయా శాఖల అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా స్టడీ అవర్‌లు నిర్వహించి విద్యార్థులను చదివిస్తున్నారు. ఇందుకోసం ప్రధాన సబ్జెక్టులైన ఇంగ్లిష్, హిందీ, సైన్స్, మ్యాథ్స్‌లకు ప్రత్యేకంగా ట్యూటర్లను నియమించారు. ఉదయం 6 : 30 గంటల నుంచి 8 : 30 వరకు, రాత్రి 8 గంటల నుంచి 10.30 గంటల వరకు ఈ తరగతులు నిర్వహిస్తున్నారు. వసతిగృహ సంక్షేమ అధికారుల పర్యవేక్షణలో జిల్లా అధికారుల సూచనలతో ట్యూటర్లతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధిస్తున్నారు.

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం..



వసతి గృహాల్లో ఉండి పదో తరగతి అభ్యసిస్తున్న విద్యార్థులు వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాం. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేశాం. రాత్రి వేళ విద్యార్థులకు టీ, స్నాక్స్ అందజేస్తున్నాం.

– కె.సత్యనారాయణ, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ

స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం..



వసతిగృహాల్లో ఉంటూ పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఉదయం, రాత్రి వేళ స్టడీ అవర్‌లు ఏర్పాటు చేస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ట్యూటర్లు ఉదయం, సాయంత్రం వసతిగృహాలకు వచ్చి విద్యార్థులను చదివిస్తున్నారు.

– జి.జ్యోతి, బీసీ సంక్షేమ శాఖ డీడీ

రాష్ట్రానికి తలమానికం.. సింగరేణి



సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల తదితరులు

- డిపెండెంట్ ఉద్యోగులకు వయోపరిమితి పెంపు
- 27 నుంచి ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ అమలు
- సింగరేణిలో స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు
- సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ తెలంగాణకు తలమానికంగా నిలవడంతోపాటు సుమారు 2,200 పరిశ్రమలకు తోడ్పానందిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉత్పత్తి చేసిన బొగ్గు ద్వారా కోట్లాది రూపాయల లాభాలు గడిస్తోందని, ఆ లాభాలను కార్మికులను పంచుతామని పేర్కొన్నారు. ఆదివారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరం 3 ఇంక్లైన్‌లో సుమారు 46 ఎకరాల్లో రూ.46 కోట్లతో ఏర్పాటు చేసిన 10.5 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధిని, కార్మిక సంక్షేమాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతీ బిడ్డకు ఉద్యోగం కల్పించే బాధ్యతతో పనిచేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో రెగ్యులర్ కార్మికులు, ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా పథకాన్ని ఈ నెల 26న ప్రారంభిస్తామన్నారు.

శ్రమదోపిడీని నివారిస్తాం

సింగరేణి సంస్థలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థల ద్వారా జరుగుతున్న శ్రమదోపిడీని నివారించాలని, స్థానికులకే 80శాతం ఉద్యోగాలు ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు, ఎమ్మెల్యేలు కోరుతున్నారని, వారి అభిప్రాయాలతో ఏకీభవిస్తామని తెలిపారు. పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మినిమం వేజెస్‌పై సమీక్ష చేయలేదని, దీనివల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. తాము అధికారంలోకి రాగానే సమీక్ష మొదలుపెట్టామన్నారు. తాను సీఎల్పీ నేతగా ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేస్తున్న సందర్భంలో కార్మిక సమస్యలు, దళారుల దోపిడీని గుర్తించానని చెప్పారు. తమ ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలో కార్మికులకు నష్టం వాటిల్లకుండా చూస్తామన్నారు. కారుణ్య నియామకాలకు డిపెండెంట్ల వయసు 35 నుంచి 40 ఏళ్లకు పెంచామని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన పది రోజుల్లోనే 441 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, రెండు రోజుల క్రితం మరో 464 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు పోతుండగా, రాబోయే కాలంలో 90 నుంచి 100 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీసేలా ప్రణాళికలు తయారుచేశామన్నారు. రాష్ట్రంలోని తాడిచర్ల, కోయగూడెం, రాంపురం తదితర బొగ్గు బ్లాకులను వదులుకోమని స్పష్టం చేశారు.

సాగునీటి ప్రాజెక్టుల్లో సౌర విద్యుదుత్పత్తికి ప్రణాళికలు

పునరుత్పాదక వనరులతో విద్యుత్ తయారీపై కొత్త పాలసీ రూపొందించాలని అధికారులకు ఆదేశించామన్నారు. సింగరేణి సంస్థలోని అన్ని ఖాళీ స్థలాల్లో సౌర విద్యుదుత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫ్లోటింగ్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. భారీ, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టులు, ప్రధాన మెయిన్ కెనాల్స్ బండ్స్‌పై సౌర విద్యుదుత్పత్తికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. ఎస్‌ఆర్‌ఎస్పీ, నాగార్జున సాగర్, శ్రీశైలం జలాశయాల్లో పంప్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ ఏర్పాటుపై దృష్టిపెట్టామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ రాష్ట్రానికి గుదిబండగా మారిందన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఈ నెల 27న చేవెళ్లలో రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తామన్నారు. మార్చిలో వినియోగదారులు 200 యూనిట్ల వరకు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేయదని పేర్కొన్నారు. త్వరలోనే డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు అందించే పథకాన్ని తిరిగి తీసుకొస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జోడీ బాగా కుదిరిందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ప్రతిపాదనలో ఉన్న నూతన భూగర్భ గనులను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా ప్రభుత్వాస్పత్రికి మరో ఐదు డయాలసిస్ యంత్రాలు, పాల్వంచ ఆస్పత్రికి డయాలసిస్ కేంద్రం మంజూరు చేయాలన్నారు. పాల్వంచలో మున్సిపల్ ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలని, కేటీపీఎస్ విస్తరణ చేయాలని కోరారు. అనంతరం రామవరంలోని కాంగ్రెస్ నాయకుడు మోత్కూరి ధర్మారావు ఇంట్లో తేనీటి విందు స్వీకరించారు. తొలుత కలెక్టర్ ప్రియాంక ఆల డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మలకు సింగరేణి గెస్ట్ హౌస్‌లో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రియాంక ఆల, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, డైరెక్టర్లు సత్యనారాయణరావు, వెంకటేశ్వర రెడ్డి, పినపాక, ఇల్లెందు, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మట్టా రాగమయి, మాలోత్ రాందాస్, జెడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, సింగరేణి గుర్తింపు సంఘం నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, సింగరేణి ప్రాతినిధి సంఘం నాయకులు బి. జనక్ ప్రసాద్, సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేరుస్తా

టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి



శ్రీనివాసరావును అభినందిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

ఖమ్మం సహకారనగర్ : తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చేలా గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోస్) తరఫున పని చేస్తానని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత తొలిసారి ఆదివారం ఆయన ఖమ్మం రాగా, గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏలూరి మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేకుండా పని చేస్తానన్నారు. రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో తొలిసారి జిల్లాకు వస్తున్న క్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు బాణసంచా కాలుస్తూ ర్యాలీ నిర్వహించగా, అర్చకులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, ట్రెజరర్ శేషప్రసాద్, నాయకులు జి.రమేష్, వాసిరెడ్డి శ్రీనివాస్, నయీమ్‌పాషా, కనపర్తి వెంకటేశ్వర్లు, ఎస్.వి. కృష్ణారావు, ఉషశ్రీ, సుధారాణి, సంజయ్, హరీష్, టీఎన్జీవోస్ నాయకులు గుంటుపల్లి శ్రీనివాస్, తాళ్లూరి శ్రీకాంత్, కొణిదన శ్రీనివాసరావు, కొమరగిరి దుర్గాప్రసాద్, రాఘవులు, రామారావు, హరిసింగ్, హకీం, బిక్కు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో వద్దిరాజు పూజలు



రవిచంద్రకు ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకున్నారు. అనంతరం ముఖ మండపంలో ఉత్సవ మూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన, ప్రత్యేక పూజలు చేశారు. రవిచంద్ర, కుటుంబ సభ్యులకు ఆచార్యులు వేదాశీర్వచనం చేయగా, అధికారులు స్వామివారి ప్రసాదం అందజేశారు.

మా మేనిఫెస్టో ఒక ప్రమాణపత్రం

- రానున్న ఎన్నికల్లో 17 ఎంపీ సీట్లు గెలుస్తాం
- ఖమ్మం టికెట్ ఇవ్వాలని అధిష్టానాన్ని కోరాను
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్



మాట్లాడుతున్న కుసుమకుమార్

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ఒక ప్రమాణ పత్రమని, అధికారంలోకి వచ్చిన వెంటనే హామీల అమలు ప్రక్రియ చేపట్టామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్ అన్నారు. డీసీసీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 17 స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం ఎంపీగా తనకు పోటీచేసే అవకాశం ఇవ్వాలని అధిష్ఠానానికి విన్నవించానని, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి తనకు టికెట్ ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇతర పార్టీల మేనిఫెస్టోలకు విలువ లేదని, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలవి మోసపూరిత వాగ్దానాలని విమర్శించారు. బీఆర్‌ఎస్ కుటుంబ పార్టీ అని, తెలంగాణ వచ్చిన తర్వాత ఆ కుటుంబం దోచుకోవడానికే సరిపోయిందని ఆరోపించారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారం నిర్మిస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎంతోమందికి ఉపాధి దొరికేదన్నారు. సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కృషి చేస్తున్నారని చెప్పారు. ఖమ్మం పార్లమెంట్ సీటును 5 లక్షల ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో టీపీసీసీ సెక్రటరీ ఏ.వీ. సత్యనారాయణ, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ భానుప్రసాద్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రం బాలగంగాధర తిలక్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ హయాంలోనే ఆదివాసీల అభివృద్ధి

- కౌసల్య జన్మస్థలి నుంచి వచ్చాను
- మన రెండు రాష్ట్రాలకు సారుప్యత ఉంది
- ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయ్
- తెలుగులో ప్రసంగించిన సీఎం



మాట్లాడుతున్న ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్

భద్రాచలం: మోదీ హయాంలోనే ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్ పేర్కొన్నారు. విజయసంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం భద్రాచలంలో నిర్వహించిన భద్రాద్రి – భద్రకాళి క్లస్టర్‌కు సంబంధించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ‘అందరికీ నమస్కారం’, ‘అందరూ బాగున్నారా’, ‘నరేంద్ర మోదీ జిందాబాద్’ అంటూ తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. శ్రీరాముడి తల్లిగారైన కౌసల్య జన్మస్థలం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రమని, ఈ ప్రాంత ప్రజల ప్రతినిధిగా ఈ రోజు భద్రాచల రాముడి దర్శనానికి తాను వచ్చానని అన్నారు. మోదీ ఆదివాసీ బిడ్డ ద్రౌపదీ ముర్ముకు దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవి అప్పగించారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంటు నుంచి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ అయోధ్య – భద్రాచలం సర్క్యూట్‌ను కేంద్రం ప్రకటించబోతుందనే సమాచారం తన వద్ద ఉందన్నారు. రాబోయే రోజుల్లో భద్రాచలం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహబూబాబాద్‌తో పాటు ఖమ్మం, వరంగల్‌లలో కూడా బీజేపీ అభ్యర్థుల విజయం ఖాయమన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ పార్టీ ఆపసోపాలు పడుతోందన్నారు. హామీలను అమలు చేయలేక చిల్లులు పడిన రేకుల డబ్బాలో చెల్లని కాసులను వేసినట్టు లొడలొడ వాగుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

ఒకే కుటుంబం దోచుకుంది

ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గడిచిన పదేళ్లుగా అధికారంలో బీఆర్‌ఎస్ ఉందని, ఈ సమయంలో ఒకే కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుందని విమర్శించారు. కేంద్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, అందులో మనం భాగస్వాములం కావాలంటే ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి ముగ్గురు ఎంపీలను గెలిపించుకోవాలని అన్నారు.

శాపం వల్లే అధికారం పోయింది

భద్రాచలానికి ప్రకటించిన రూ.100 కోట్లు, వరదలప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ఆ శాపం వల్లే కేసీఆర్ అధికారం కోల్పోయారని యాత్ర కార్యవర్గ నిర్వహణ సభ్యుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో భద్రాచలం కేంద్రంగా కొత్త రైల్వే ప్రాజెక్టులు రానున్నాయని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మాజీ మంత్రి విజయరామారావు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, కుంజా ధర్మా, ముస్కు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వశిష్టగోత్రంతో ప్రత్యేక పూజలు

ఛత్తీస్‌గఢ్ సీఎం తొలుత శ్రీ సీతారామ చంద్రస్వామివారి దర్శించుకున్నారు.ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్‌లు సీఎం గోత్రమైన వశిష్ఠ గోత్రం, బస్తర్ రాజు కమల్ గోత్రం కశ్యపు గోత్రనామాలతో అర్చన జరిపారు. శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. తొలుత సీఎం విష్ణుదేవ్‌సాయి, బస్తర్ రాజు కమల్ చంద్ర్ బంజ్‌దేవ్‌లకు ఈఓ రమాదేవి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

పటిష్ట బందోబస్తు

ఏజెన్సీ ప్రాంత కేంద్రమైన భద్రాచలంలో ఛత్తీస్‌గఢ్ సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు ప్రత్యేక బందోబస్తు చేపట్టాయి. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ రెండు రోజుల ముందే మార్కెట్ యార్డు, దేవస్థానం ప్రాంతాలను పరిశీలించారు. ఆదివారం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు తనిఖీలను జరిపారు. పర్యటన పూర్తయ్యేవరకు ప్రత్యేక పోలీసు, సీఆర్‌పీఎఫ్ బలగాలు ఆయా ప్రాంతాలను తమ అదుపులోనే ఉంచుకున్నాయి.

క్లుప్తంగా

రసవత్తరంగా క్రికెట్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్ : ఖమ్మం ప్రీమియర్ లీగ్ ట్వెంటీ-20 క్రికెట్ పోటీల్లో భాగంగా ఆదివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో జెవీడీ చిత్తాస్ జట్టు జయభేరి మోగించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జెవీడీ చిటాస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. జట్టులో ధీరజ్‌కుమార్ 25 బంతులు ఆడి 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 83 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ సూర్యకిరణ్ 38 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 59 పరుగులు, తపస్వీ 34 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లు చేసి 46 పరుగులు చేశారు. కాగా, ప్రత్యర్థి సీస్టార్స్ జట్టు 87 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. మ్యాచ్‌లను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహక అధ్యక్షులు కూరపాటి ప్రదీప్‌కుమార్, వెంకట్, లక్ష్మణ్, ఓలేటి సాంబమూర్తి, మతిన్, రాంబాబు, సునీల్, శ్రీకాంత్, సైదులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రెజర్‌బాంబు పేలి సీఏఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ మృతి

చర్ల: మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు పేలి ఓ సీఏఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా మిర్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బేచాపాల్ క్యాంపు నుంచి ఏరియా డామినేషన్ కోసం ఛత్తీస్‌గఢ్ ఆర్మ్ ఫోర్స్ పోలీసులు కుతుల్‌పారా నుంచి గండోకల్‌పారా మీదుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో బేచాపాల్ సమీపంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు పేలి సీఏఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఆశీష్‌యాదవ్‌కు తీవ్ర గాయాలై అక్కడకక్కడే మృతి చెందాడు. ఈ ఘటనను బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ ధ్రువీకరించారు.

మార్చురీలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం

బూర్గంపాడు: బూర్గంపాడులోని ఇండియన్ ఆయిల్ బంక్ సమీపాన శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు(20) మృతిచెందాడు. ఆ యువకుడు ఎవరనేది ఆదివారం రాత్రి వరకు తెలియరాలేదు. నడుచుకుంటు వెళ్తున్న యువకుడిని గుర్తు తెలియన వాహనం ఢీ కొట్టడంతో తలకు తీవ్రగాయమై మృతిచెందాడు. మృతదేహాన్ని బూర్గంపాడు సివిల్ ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. మృతుడివివరాల కోసం పోలీసులు దర్యాప్తు చేయగా.. అతడు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస ఆదివాసీ కూలీగా తెలుస్తోంది. బూర్గంపాడు పరిసర గ్రామాల్లో మిర్చి కోతకు గాని, జామాయిల్ కర్ర నరికేందుకు వచ్చి ఉంటారని భావిస్తున్నారు.

టేకులపల్లిలో వైన్ షాపు సీజ్

టేకులపల్లి: మండలంలో మొత్తం నాలుగు వైన్ షాపులు ఉండగా.. వాటిలో పల్లవి వైన్స్ పేరుతో ఉన్న ఒక వైన్ షాపును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. ఈనెల 19వ తేదీన ఈ షాపుపై ఫిర్యాదు రావడంతో ఆబ్కారీ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి షాపుకి తాళాలు వేశారు. కానీ ఈ విషయాన్ని మీడియాకు చెప్పకపోవడం గమనార్హం. ఈ విషయమై ఇల్లెందు ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్‌ను వివరణ కోరగా.. ఎమ్మార్పీ వయోలెన్స్‌పై ఫిర్యాదు రావడంతో ఎన్‌ఫోర్స్‌వారు సీజ్ చేసి కేసు నమోదు చేశారని, ఎక్సైజ్ ఎస్ఐ కొత్తగా వచ్చారు.. తానేమో మేడారం డ్యూటీలో ఉండడంతో మీడియాకు చెప్పడం మరిచిపోయామని సమాధానం ఇచ్చారు.

రిమోట్ కంట్రోల్‌తో మిర్చి తూకంలో మోసం..


వ్యాపారస్తులు ఉపయోగించిన కాంటా, రిమోట్

దుమ్ముగూడెం: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు రైతులకు చేతికొచ్చిన తర్వాత కూడా వాటిని అమ్ముకునే సమయాన కొందరు వ్యాపారస్తుల మోసాలకు బలికావాల్సి వస్తోంది. మండలంలోని మారాయిగూడెం గ్రామానికి చెందిన సొందె రాజు దగ్గరకు సుజాతనగర్‌కు చెందిన మిర్చి కొనుగోలు వ్యాపారస్తులు కొనుగోలు నిమిత్తం ఆదివారం ఉదయం వచ్చారు. మిర్చి కాంటా వేసి తమ వాహనంలో లోడ్ చేసుకున్న తర్వాత మొత్తం లెక్క కట్టడంతో మిర్చి తూకం తక్కువ రావడంతో వారిని నిలదీశారు. మొత్తం మిర్చిని కిందకు దించిన వెంటనే వాహనం వేసుకుని ఓ వ్యక్తి పరారు కాగా మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. దీంతో కొనుగోలుదారుల వద్ద నుంచి కాంటా రిమోట్ లభించడంతో గ్రామస్తులు వారిని పట్టుకున్న వ్యక్తికి దేహశుద్ధి చేయగా మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. సాయంత్రం వరకు ఆ వ్యక్తి గ్రామస్తుల అదుపులోనే ఉన్నట్టు సమాచారం.

తిలక్‌నగర్‌లో చోరీ..

ఇల్లెందురూరల్: మండలంలోని తిలక్‌నగర్ గ్రామపంచాయతీలో చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. సింగరేణి కార్మికుడు బోయిన రవి కుటుంబసభ్యులతో కలిసి మూడు రోజుల క్రితం మేడారం జాతరకు వెళ్లాడు. తిరిగి ఆదివారం ఇంటికి చేరుకోగా ఇంటికి వేసిన తాళం పగలగొట్టి కనిపించడంతో రవి ఇంట్లోకి వెళ్లి చూశాడు. దీంతో బీరువా పగలగొట్టి అందులో ఉన్న 15 తులాల బంగారం, 50 కిలోల వెండి, రూ.3వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు నిర్ధారించుకున్నాడు. ఈ మేరకు రవి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దేవుడి భూములకు ఎసరు!

- కుదిరితే ఆక్రమణ... లేదంటే మట్టి అమ్మకం
- అక్రమార్కుల చెరలో వందలాది ఎకరాలు
- రూ.కోట్ల విలువైన భూమి కబ్జా కోరల్లో..
- జీళ్లచెరువు ఘటనతో కదిలిన అధికార యంత్రాంగం


అమ్మగూడెంలోని దేవాలయ భూములు

నేలకొండపల్లి: దేవాలయాల్లో దీప, ధూప, నైవేద్యాలకు ఆటంకం ఎదురుకాకుండా ఏళ్ల క్రితం దాతలు వందల ఎకరాల భూమి రాసిఇచ్చారు. కానీ నేడు అక్రమార్కులు పలువురు ఆ భూములనే కొల్లగొడుతున్నారు. ఇప్పటికే వందల ఎకరాలు ఆక్రమణకు గురైనా సంబంధిత అధికారులలో కదలిక కానరావడం లేదు. ఈ భూములపై కన్నేసిన అక్రమార్కులు కుదిరితే ఆక్రమించుకోవడం లేదంటూ.. భూమి నుంచి మట్టి తరలించి సొమ్ము చేసుకోవడం సాధారణంగా మారింది. ఇటీవల రాష్ట్రంలో కొలువుదీరిన ప్రభుత్వం భూముల ఆక్రమణలపై కన్నెర్ర చేయడం.. జిల్లాలోని జీళ్లచెరువు ఆలయ భూముల నుంచి మట్టి తవ్వి అమ్ముకున్న విషయం బయటపడడంతో మేల్కొన్న అధికారులు భూముల రక్షణకు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

ధరలకు రెక్కలు రావడంతో..

జిల్లా మీదుగా రహదారుల నిర్మాణం జరుగుతుండడానికి తోడు వెంచర్ల ఏర్పాటుతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో ఎక్కడ ఖాళీ భూములపై కబ్జాదారులు కన్నేస్తున్నారు. ప్రధానంగా దేవాదాయ శాఖ పరిధిలోని భూములపై పెద్దగా అధికారుల దృష్టి లేకపోవడంతో ఆక్రమణ సులువవుతుంది. జిల్లాలోని పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలంలోని అమ్మగూడెంలో శ్రీరాజగోపాలస్వామి, శ్రీరాజరాజేశ్వరి ఆలయానికి చెందిన 42 ఎకరాల భూమి ఉంది. కానీ పర్యవేక్షణ కరువై దాదాపు 10 ఎకరాల మేర ఆక్రమణకు గురైంది. ఈ భూమి విలువ రూ.4 కోట్ల వరకు ఉంటుందని అంచనా. అయినా ఎవరూ పట్టించుకోక మిగిలిన భూమిలోని మట్టిని తవ్వి అమ్ముకున్నారు.

జీళ్లచెరువు ఘటనతో కదలిక..

జీళ్లచెరువులోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ భూముల నుంచి కొందరు అక్రమంగా మట్టి తరలించి సొమ్ము చేసుకున్నారని అధికారులు గుర్తించారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకుడైన డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. అదేరోజు నేలకొండపల్లి మండలంలోని అమ్మగూడెంలో ఆలయ భూముల నుంచి మట్టి తరలిస్తుండగా గ్రామస్తుల సమాచారంతో దేవాదాయ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలోనే అధికారులు దేవాదాయ భూములకు హద్దులు నిర్ధారిస్తుండడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినా అక్రమార్కులు తొలగిస్తున్నారు. ముదిగొండ మండలం శ్రీలక్ష్మీనరసింహస్వామి, చెన్నకేశవస్వామి ఆలయ భూములు 308, 309, 310 సర్వే నంబర్లలో 33.26 ఎకరాలు ఉండగా, కొందరు ఆక్రమించుకున్నారు. దీంతో అధికారులు స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటుచేస్తే వీటిని తొలగించడంపై ఈఓ పి.నారాయణచార్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, ఫిర్యాదులు అందినప్పుడే అధికారులు స్పందిస్తుండడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. భూమిని కబ్జా చేయడం, లేదంటే మట్టి అమ్ముకోవడం సర్వసాధారణమైంది. కాగా, జీళ్లచెరువు, అమ్మగూడెంలం ఘటనలతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేయగా రంగంలోకి దిగిన అధికారులు పర్యవేక్షణ ఎన్నాళ్లు కొనసాగిస్తారో వేచి చూడాల్సిందే.

ఆక్రమణలను సహించేది లేదు...



ఆలయ భూములు ఆక్రమిస్తే ఎంతటి వారైనా సహించేది లేదు. ఇప్పటికే అమ్మగూడెంలో మట్టి తరలింపుపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. మట్టి తరలించినా, భూమి ఆక్రమించినా చర్యలు ఉంటాయి. ఆక్రమణలపై ఎవరి వద్దయినా ఆధారాలు ఉంటే అందించాలి.

– సమత, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్, ఖమ్మం

బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందే...



అమ్మగూడెంలోని దేవాలయం భూముల నుంచి మట్టి తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో అధికారులు సమగ్రంగా విచారణ జరిపించాలి. అంతేకాక భూములకు హద్దులు ఏర్పాటు చేసి గ్రామానికి అప్పగించాలి.

– వాసంశెట్టి వేణు, అమ్మగూడెం

ఆక్రమణల్లో కొన్నింటి వివరాలు..

- నేలకొండపల్లిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి మంగాపురం తండాలో దాదాపు 250 ఎకరాల భూమి ఉంది. అందులో కొంత ఇరిగేషన్ కాల్వ, చెరువు ఆయకట్టు కింద తీసేశారు. మిగతా భూమిలో చాలావరకు ఆక్రమణలో ఉన్నట్లు తెలుస్తోంది.
- ఇదే మండలం సింగారెడ్డిపాలెం, బోదులబండ, రాజేశ్వరపురం చెరువుమాధారంల్లోని ఆలయ భూముల ఆక్రమణలో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.
- తిరుమలాయపాలెం మండలంలోని పాతర్లపాడులోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వందల ఎకరాల భూమి ఉంది. ఈ భూమి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో ఉండగా.. అధికారుల పట్టింపు లేని తనం కారణంగా 472 ఎకరాల వరకు ఆక్రమణకు గురైంది.
- తిరుమలాయపాలెం మండలంలోని తెట్టెలపాడులో శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ భూమి అక్రమార్కుల చెరలో పడింది.
- కూసుమంచి మండలంలోని జీళ్లచెరువులోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి చెందిన ఐదెకరాలు భూమి ఆక్రమణలో ఉన్నట్లు తెలుస్తోంది. రూ.కోట్ల విలువైన భూములపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలోని సంగమేశ్వరస్వామి ఆలయానికి చెందిన మూడెకరాలను కొందరు ఆక్రమించి అనుభవిస్తున్నారు. దీని విలువ దాదాపు 80 లక్షల వరకు ఉంటుందని అంచనా.
- ముదిగొండ మండలంలోని సువర్ణాపురం శ్రీ లక్ష్మీనరసింహస్వామి, చెన్నకేశవ ఆలయాలకు చెందిన 33.26 ఎకరాలు సైతం ఆక్రమణకు గురికాగా, ఇటీవలే స్వాధీనం చేసుకున్నారు.

మహిళా సిబ్బందికి న్యూడ్ కాల్స్..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న మహిళా సిబ్బందికి పబ్లిక్ హెల్త్ ఉద్యోగి ఒకరు న్యూడ్ కాల్స్ చేసి వేధిస్తున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల క్రితం పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పని చేస్తూ కుక్కలను పట్టే విభాగంలో ఉన్న సదరు ఉద్యోగి కొంతమంది మహిళా జవాన్‌లకు వాట్సాప్ ద్వారా వీడియో కాల్ చేసి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు సమాచారం. ఒంటిపై దుస్తులు లేకుండా వీడియో కాల్ మాట్లాడాడని, పదేపదే తమను ఇబ్బందులకు గురి చేశాడని సదరు మహిళా సిబ్బంది కేఎంసీ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా సిబ్బంది ఫోన్ కట్ చేసినా.. పదేపదే ఫోన్ చేసి వేధించినట్లు అధికారుల వద్ద సిబ్బంది మొర పెట్టుకున్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ఓ ఉద్యోగి ప్రవర్తించాడని, ఆధారాలతో సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై కార్మిక సంఘాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. తప్పు చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవడానికి అధికారులకు ఏమి ఇబ్బంది వచ్చిందని, సదరు ఉద్యోగిపై ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. దీనిపై కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌ను వివరణ కోరగా.. తమకు ఈ ఘటనపై ఫిర్యాదు అందిందని, కమిషనర్ రాగానే ఆయన దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని దురదపాడు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. స్థానిక ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఆధ్వర్యాన నిర్వహించిన ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2,150లతో పాటు ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అన్నదాతలపై కాల్పులు అమానుషం

- కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్


మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

ఖమ్మంమయూరిసెంటర్ : పంటలకు కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ) కల్పించాలని ఢిల్లీలో ఆందోళన చేస్తున్న అన్నదాతలపై మోదీ ప్రభుత్వం కాల్పులు జరపడం అమానుషమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ అన్నారు. ఢిల్లీలో రైతుల ఆందోళనకు మద్దతుగా సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఎమ్మెస్పీ పై ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రుల కమిటీ చైర్మన్‌గా వ్యవహరించిన నాటి గుజరాత్ సీఎం నరేంద్ర మోదీ నేడు ప్రధానమంత్రిగా ఆ కమిటీ సూచనలను ఆచరణలో పెట్టడం లేదని విమర్శించారు. స్వామినాథన్ సిఫారసుల అమలుతోనే ఆయనకిచ్చిన భారతరత్నకు సార్థకత చేకూరుతుందని.. స్వయంగా ఆయన కుమార్తె మధుర వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావించారు. ధాన్యాలు, పప్పులు, నూనె గింజలు, వాణిజ్య తదితర 23 రకాల పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా మోదీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వాస్తవ ధరకు కౌలు, పెట్టుబడి, శ్రమ, ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు.. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మొత్తం ఖర్చుపై 50 శాతం అదనంగా ఎమ్మెస్పీ నిర్ధారించాలని అన్నారు. ఢిల్లీలో రైతుల ఆందోళనలకు మద్దతుగా నిర్వహించే ఉద్యమాలకు సంఘీభావం తెలపాలని ప్రజలను కోరారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, బండి రమేష్, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

327 యూనియన్‌లో చేరిక


327 యూనియన్‌లో చేరిన నాయకులు, కార్మికులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లాకు చెందిన వివిధ విద్యుత్ సంఘాలకు చెందిన నాయకులు, సభ్యులు ఆదివారం తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(327)లో చేరారు. హెచ్–82, టీఆర్‌వీకేఎస్‌లకు చెందిన విప్పా వేణుమోహన్, వి.మధు, యూ.నాగేశ్వరరావు, రామకృష్ణ, బి.శ్రీనివాస్, మాంగయ, జి.నాయక్ తదితరులు ఆ సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ ఆధ్వర్యాన 327 యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. ఖమ్మంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం కంపెనీ అధ్యక్షులు పి.మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందపాటి సత్యనారాయణరెడ్డి, వి.సీతారాంగోపాల్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ.రవికుమార్, కోశాధికారి సత్యనారాయణ, ఖమ్మం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.నాగేంద్రకుమార్, వల్లాల యుగంధర్, ఎస్.జైప్రకాష్, ఖమ్మం రూరల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె.దావూద్, జీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

బీమా కంపెనీ అప్పీల్‌ను కొట్టేసిన హైకోర్టు

బాధితుడికి రూ.1.27.10.500 నష్టపరిహారం ఇవ్వాలని తుది తీర్పు

ఖమ్మం లీగల్: రోడ్డు ప్రమాద బాధితుడికి బీమా నియమనిబంధనల ప్రకారం బీమా కంపెనీ నష్టపరిహారం చెల్లించాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్యాంకోషి, జస్టిస్ ఎస్.తుకరాంజీ ఈ నెల 15వ తేదీన తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. అక్టోబర్ 22, 2014న ఉదయం ఖమ్మానికి చెందిన మొక్కజొన్నల హోల్‌సేల్ వ్యాపారి రామిశెట్టి శ్రీనివాసరావు తన భార్య పేరుతో ఉన్న ప్రైవేట్ మారుతి కారులో ఖమ్మం నుంచి విజయవాడ వెళ్తున్నాడు. ఈక్రమంలో డ్రైవర్ మితిమీరిన వేగంతో నిర్లక్ష్యంగా కారును నడిపి చింతకాని పోలీస్‌స్టేషన్ పరిధిలోని నామవరం దగ్గర రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఫలితంగా కారులో ప్రయాణిస్తున్న శ్రీనివాసరావుకి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై చింతకాని పోలీసులు డ్రైవర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు.

బాధితుడి వైపే కోర్టుల తీర్పు..

ఖమ్మంలో బాధితుడు శ్రీనివాసరావు రూ.1.75కోట్లకు జిల్లా మోటార్ యాక్సిడెంట్ ట్రిబ్యూనల్‌లో నష్టపరిహారం కోసం జూలై 30, 2015న కేసు దాఖలు చేశాడు. అతడికి 75 శాతం అంగవైకల్యానికి గురైనట్లు ఖమ్మం మెడికల్ బోర్డు ధ్రువీకరిస్తూ కోర్టులో సాక్ష్యం చెప్పారు. శ్రీనివాసరావుకు వార్షిక ఆదాయం రు.8,27,759 ఉన్నట్లు, అంగవైకల్యాన్ని సైతం రుజువు చేయడంలో భాగంగా ఆదాయ పన్ను శాఖ మూడేళ్ల వార్షిక నివేదికలు కోర్టులో దాఖలు చేశారు. దీంతో బాధితుడు కేసు నిరూపించడంలో భాగంగా ఆదాయ పన్ను శాఖ సంబంధిత అధికారులు, ఆడిటర్లు, డాక్టర్లను మొత్తం 12 మంది సాక్షులను కోర్టు విచారించారు. బాధితుడి భార్య సునిత కారు యజమాని అవడంతో అందులో ప్రయాణిస్తున్న భర్త శ్రీనివాసరావు కూడా యజమాని అవుతాడు కాబట్టి ఓరియంట్ బీమా కంపెనీ వారు వారికి ఎటువంటి నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత లేదని కోర్టులో వాదించింది. ఇరుపక్షాల వాదనలు విన్న అప్పటి 8వ అదనపు జిల్లా జడ్జి పి.చంద్రశేఖరప్రసాద్ డిసెంబర్ 2, 2019న బాధితుడికి రూ.1,25,10,500లు నష్ట పరిహారం మంజూరు చేసింది. అంతేకాక 6 శాతం వార్షిక వడ్డీతో కోర్టులో పరిహారం కేసు దాఖలు చేసిన తేదీ నుంచి చెల్లించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు. తీర్పును సవాల్ చేస్తూ బీమా కంపెనీ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు దాఖలు చేయగా.. బాధితుడు కూడా తనకు తనకు పరిహారం పెంచాలని క్రాస్ అబ్జక్షన్స్ దాఖలు చేశాడు. దీంతో ఇరు పక్షాల వాదనలు విన్న రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన అనేక తీర్పులను పరిశీలించి బీమా కంపెనీ అప్పీల్‌ను కొట్టిసి బాధితుడికి కింది కోర్టు ఇచ్చిన పరిహారానికి అదనంగా మరో రూ.2 లక్షలు పెంచుతూ తీర్పు చెప్పింది. హైకోర్టులో న్యాయవాది కాశిరెడ్డి జగత్‌పాల్‌రెడ్డి, కింది కోర్టులో శ్రీరామిశెట్టి హరిప్రసాద్‌లు బాధితుడి తరఫున వాదించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: ఓ వివాహిత టాబ్లెట్ మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన రోజా (20) అనే వివాహిత ఆదివారం బీపీ టాబ్లెట్ మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

బొలెరో వాహనాన్ని ఢీకొట్టిన లారీ..

నలుగురు కూలీలకు గాయాలు


ప్రమాద స్థలంలో కూలీలు

కొణిజర్ల: మిర్చి కోతలకు వచ్చి స్వగ్రామానికి వెళ్తున్న కూలీల బొలెరో వాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో నలుగురు మహిళా కూలీలు గాయపడ్డ సంఘటన మండలంలోని పల్లిపాడు సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. నల్ల గొండ జిల్లా కేతేపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన 20 మంది కూలీలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలో మిర్చి కోతల నిమిత్తం వచ్చారు. కోతలు పూర్తవడంతో తిరిగి తమ గ్రామానికి బయలుదేరి వెళ్తున్నారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న బొలేరో వాహనాన్ని పల్లిపాడు వద్ద ఖమ్మం వైపు నుంచి వెళ్తున్న లారీ ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న కూలీలు సువార్త, విమలమ్మ, లాజరు, కమలమ్మలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాహనంలో 20 మంది కూలీలు ఉన్నారు. వాహనం అదుపు తప్పి పల్టీ కొట్టి ఉంటే పెను ప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

గొత్తికోయ యువకుడి ఆత్మహత్య

టేకులపల్లి: ప్రేమించిన యువతి ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని మనస్తాపం చెందిన గొత్తికోయ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బోడు ఏఎస్ఐ బీల్య నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి 22 ఏళ్ల క్రితం టేకులపల్లి మండలం బర్లగూడెం పంచాయతీ మొట్లగూడెం గ్రామానికి వలస వచ్చిన గొత్తికోయ మొక్కటి దేవయ్య కుమారుడు మొక్కటి దేవా(21) ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ యువతితో ప్రేమాయణం సాగిస్తున్నాడు.. ఆమె యువకుడు ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయక పోవడంతో మనస్తాపం చెంది శనివారం రాత్రి గుర్తుతెలియని పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆళ్లపల్లి పీహెచ్‌సీకి ఆపై కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆ యువకుడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

గుర్తుతెలియని దుండగుల పైశాచికత్వం

- కిరాణ షాపు, గడ్డివాము, బైక్‌ను తగులబెట్టిన ఆకతాయిలు
- సుమారు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం


మంటలను ఆర్పుతున్న ఫైరింజన్ సిబ్బంది


దుండగులు నిప్పంటించిన బడ్డీ కొట్టు

బోనకల్ : గుర్తు తెలియని దుండగుల పైశాచికత్వానికి మండలంలోని చారునోముల గ్రామస్తులకు సుమారు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామంలోని కిరాణ షాపు, గడ్డివాము, బైక్‌ను ఆదివారం తెల్లవారుజామున పెట్రోల్ పోసి నిప్పంటించారు. వివరాల్లోకెళ్తే.. గ్రామానికి చెందిన చాపలమడుగు తిరుపతిరావుకు చెందిన కిరాణ షాపు, చాపలమడుగు రమేష్, శ్రీనులకు చెందిన గడ్డివాము, బైక్‌ను ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో కొందరు గుర్తు తెలియని దుండగులు పెట్రోలు పోసి నిప్పంటించారు. దీంతో మంటలు చెలరేగగా.. చుట్టుపక్కల వారు గమనించి ఫైరింజన్‌కు ఫోన్‌చేసి మంటల ఆర్పే ప్రయత్నం చేశారు. కాని అప్పటికే గడ్డివాము దహనం కాగా, కిరాణ షాపుకు అంటుకున్న మంటలను చుట్టుపక్కల వారు ఆర్పివేశారు. అనంతరం సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో కుటుంబ గొడవల కారణంగా సంఘటన జరిగి ఉంటుందని బాధితులు ఆరోపిస్తున్నారు. నిందితులను పట్టుకొని కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


గోవర్ధన్ (ఫైల్)

వైరారూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని స్టేజీ పినపాక హైలెవల్ వంతెన సమీపాన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తల్లాడ పట్టణ కేంద్రానికి చెందిన సాలే గోవర్ధన్ (21) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతుండడంతో పాటు తల్లాడలోని ఓ కొరియర్ సెంటర్‌లో పార్ట్ టైం కొరియర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో తన సొంత పనుల నిమిత్తం వైరా వచ్చి తిరిగి తన స్వగ్రామమైన తల్లాడకు ద్విచక్రవాహనం మీద వెళ్తుండగా.. మార్గమధ్యలోని స్టేజీపినపాక హైలెవల్ వంతెన సమీపాన గోవర్ధన్ ద్విచక్ర వాహనాన్ని ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో గోవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, మృతుడు అవివాహితుడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గోవర్ధన్ మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ADMISSIONS
■ అడ్మిషన్స్: 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, PG /B.Tech/M.Tech/MBA/MCA/MS/MBBS/D/B/M ఫార్మసీ, FAST TRACK (ఫెయిల్ స్టూడెంట్) WT'S app: PH: 7993080835. [HA-1267]

Services

BUSINESS OFFER
■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1252668]

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338 [G-824430]

Wanted
■ ఖమ్మంలో గల శ్రీ సాయి సోలార్ ఎనర్జీ సిస్టమ్ నందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్-1 (Female), మార్కెటింగ్-2 (Male) వెంటనే కావలెను. సంప్ర. సెల్ : 72888 88688. [M-1167532]
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ మేసేజ్‌లు పంపుతూ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 95027 12418, 90306 12463 [M-1233799]
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217 [M-1233851]
■ హరేకృష్ణ హోమ్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899. [H-793694]
■ ఇంటి పని, హౌస్ బాయ్, బేబీకేర్, పేషెంట్ కేర్ నర్సు (M/F), వంట మనిషి. జీతం: 15k-30k, 8 గం, 10 గం, 24 గం, భో+వసతి, లోన్, బోనస్ ఫ్రీ. ఫోన్: 9160002192 / 9160002193 [H-788148]
■ రామకృష్ణ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ + జీ: 15-18 వేలు, ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52843, 92814 52838 [B-1239086]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182
9010299957
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.